జాతీయ దినపత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక : 188 | సోమవారం | 27-7-2026








PUBLISHED FROM : HYDERABAD,KARIMNAGAR, WARANGAL, NALGONDA, KHAMMAM, MAHABOOBNAGAR, NIZAMABAD
వెల: రూ.5/- పేజీలు: 08





## పరీక్షల సంస్కరణలకు హైపవర్ టాస్క్‌ఫోర్స్

- నందన్ నీలేకని నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- పరీక్షల భద్రతకు సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యం
- పేపర్ లీకుల నివారణకు కఠిన చట్టం
- సోమవారం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టనున్న కేంద్రం
- ఎన్‌టీఏ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణపై సిఫార్సులు
- డిజిటల్ భద్రత, డేటా రక్షణకు ఆధునిక పరిష్కారాలు
- పారదర్శక పరీక్షల నిర్వహణే లక్ష్యమన్న ప్రధాని

దిల్లీ: దేశవ్యాప్తంగా నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటన తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో సమగ్ర సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. పరీక్షల వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా తీర్చిదిద్దేందుకు

(మిగతా 2వ పేజీలో)

# యువశక్తికి రాజకీయాల్లో చోటివ్వాలి



- దేశ భవిష్యత్తుకు 'జై యువ' నినాదమే దిక్సూచి
- ఎన్నికల్లో పోటీ వయోపరిమితి తగ్గించాలని సూచన
- అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని వెల్లడి
- నీట్ వ్యవహారంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శ
- విద్యార్థులపై నమోదైన కేసులు ఉపసంహరించాలని డిమాండ్
- యువత రాజకీయాల్లోకి వస్తే దేశం మరింత బలపడుతుందన్న సీఎం

హైదరాబాద్: దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ఇకపై 'జై జవాన్, జై కిసాన్'తో పాటు 'జై యువ' నినాదంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. యువశక్తిని రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్యం చేస్తే భారతదేశం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశంగా ఎదుగుతుందని అన్నారు. యువతతో కేంద్ర ప్రభుత్వం పోరాడాలని భావిస్తే గెలుపు ఎవరిదో కాలమే నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జాతీయ మీడియాతో మాట్లాడిన ఆయన, దేశంలో యువశక్తి ముందు కేంద్ర ప్రభుత్వం తలవంచాల్సి వచ్చిందన్నారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న వైఫల్యాలపై యువత దేశవ్యాప్తంగా చేసిన పోరాటం కారణంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఎం విమర్శించారు. సీబీఎస్‌ఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడంలో కేంద్రం వైఫల్యం చెందిందని, దీనివల్ల లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఈ అంశంపై ప్రతిపక్షాలు పలుమార్లు హెచ్చరించినప్పటికీ కేంద్రం

(మిగతా 2వ పేజీలో)



## మూడేళ్లలో కొత్తపల్లి రైల్వే ప్రాజెక్టు పూర్తి

- కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- 2029 నాటికి కొత్తపల్లి రైల్వే లైన్ అందుబాటులోకి
- డిసెంబరులో సిరిసిల్ల.. 2028 జూన్‌లో వేములవాడ స్టేషన్
- భూసేకరణ పూర్తైతే యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్ పనులు
- తెలంగాణలో రూ.48 వేల కోట్లతో రైల్వే అభివృద్ధి పనులు
- రాష్ట్రాభివృద్ధిలో కేంద్రం సమన్యాయం: కిషన్‌రెడ్డి

సిద్ధిపేట: మరో మూడేళ్లలో మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే ప్రాజెక్టును పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రకటించారు. సిద్ధిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం సమీపంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను ఆదివారం ప్రారంభించిన ఆయన, అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. మనోహరాబాద్––కొత్తపల్లి రైల్వే మార్గం పనులు దశలవారీగా కొనసాగుతున్నాయని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి సిరిసిల్ల రైల్వే స్టేషన్‌ను,

(మిగతా 2వ పేజీలో)

## శ్రీరాంసాగర్ జలాశయంలో విషాదం.. ఈతకు వెళ్లి నలుగురు యువకులు మృతి



- నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో విషాద ఘటన
- ముప్కాల్ వద్ద బ్యాక్‌వాటర్‌లో ఈతకు వెళ్లి నలుగురు యువకులు మృతి
- ఐదుగురిలో ఒకరు సురక్షితంగా ఒడ్డుకు చేరిక
- స్థానికులు మృతదేహాలను వెలికితీశారు
- ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టిన పోలీసులు

## విదేశీ ఉద్యోగాల పేరుతో చీటింగ్ విజయవాడ దంపతులపై హైదరాబాద్‌లో కేసు

- విదేశీ ఉద్యోగాల పేరుతో రూ.14 లక్షలు వసూలు చేసిన దంపతులు
- బేగంపేటలో ఫ్లయింగ్ బోర్డర్ కన్సల్టెన్సీ పేరిట మోసం
- ఇప్పటికే విజయవాడలో అరెస్ట్ అయి బెయిల్‌పై విడుదలైన జంట
- మొత్తం 750 మంది నుంచి 12 కోట్లు వసూలు చేసినట్లు ఆరోపణలు
- మోసం చేసిన డబ్బుతో రియల్‌ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టిన వైనం




## విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రాజీనామా చేయాల్సిందే: తెలంగాణ బీజేపీ

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వారంలోగా చెల్లించాలని సీఎం రేవంత్‌కు బీజేపీ అల్టిమేటం
- లేదంటే విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని రాంచందర్ రావు డిమాండ్
- నీట్ వివాదంలో యువతను రెచ్చగొట్టి ప్రధాని మోదీని బలహీనపరిచేందుకు కుట్ర జరిగిందని ఆరోపణ
- తెలంగాణలో పేపర్ లీక్‌లపై గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఎందుకు మౌనంగా ఉన్నాయన్న డీకే అరుణ





## చైనాలో తుపాను బీభత్సం

- నౌల్ తుపాను ధాటికి 10 మంది మృతి
- గంటకు 162 కి.మీ. వేగంతో ఈదురుగాలులు
- భారీ వర్షాలతో వరదల ముప్పు
- గ్వాంగ్‌డాంగ్‌లో రైలు, విమాన సేవలు నిలిపివేత
- జనజీవనం పూర్తిగా స్తంభించిన పరిస్థితి
- బావి తుపాను కంటే తీవ్ర ప్రభావమని చైనా వెల్లడి

# ఆదిలాబాద్ ఎయిర్‌ఫీల్డ్‌కు రూ.2,278 కోట్ల అనుమతి

- ఉత్తర తెలంగాణ అభివృద్ధికి కీలక ప్రాజెక్టు : మంత్రి కోమటిరెడ్డి
- జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌కు పరిపాలనా అనుమతి
- 2,009 ఎకరాల భూసేకరణ చేపట్టనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఐఏఎఫ్, సివిల్ ఏవియేషన్‌కు ప్రత్యేక కేటాయింపులు
- మౌలిక వసతుల మార్పిడి పనులకు కూడా నిధులు
- డిసెంబరు 31 నాటికి భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశాలు



హైదరాబాద్: ఉత్తర తెలంగాణ అభివృద్ధికి మరో కీలక అడుగు పడిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్‌లో ప్రతిష్ఠాత్మక జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,278.14 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 2,009.23 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో 1,609.23 ఎకరాలు భారత వైమానిక దళం అవసరాల కోసం, మరో 400 ఎకరాలు

(మిగతా 2వ పేజీలో)



## మోదీ ఇమేజ్‌ను కాపాడటానికే నీలేకని కమిటీ: కాంగ్రెస్

- గత కమిటీ సిఫార్సులు అమలు చేయలేదని జైరాం రమేశ్ విమర్శ
- చూసాకు రెండేళ్లుగా పూర్తిస్థాయి డీజీ లేరని ఆరోపణ
- కేంద్ర మంత్రి రాజీనామా తర్వాత కొత్త కమిటీ ప్రకటన

# శ్రీరాంసాగర్ జలాశయంలో విషాదం.. ఈతకు వెళ్లి నలుగురు యువకులు మృతి

**నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో విషాద ఘటన**

**ముప్కాల్ వద్ద బ్యాక్‌వాటర్‌లో ఈతకు వెళ్లి నలుగురు యువకులు మృతి**

**ఐదుగురిలో ఒకరు సురక్షితంగా ఒడ్డుకు చేరిక**

**స్థానికులు మృతదేహాలను వెలికితీశారు**

**ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టిన పోలీసులు**



నిజామాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ) బ్యాక్‌వాటర్‌లో ఈతకు వెళ్లిన నలుగురు యువకులు నీట మునిగి మృతి చెందారు. వీరితో పాటు వెళ్లిన మరో యువకుడు సురక్షితంగా ఒడ్డుకు చేరుకోవడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, ముప్కాల్ సమీపంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వెనుక జలాల్లోకి ఐదుగురు యువకులు ఆదివారం సాయంత్రం ఈతకు వెళ్లారు. నీటి లోతును అంచనా వేయలేకపోవడంతో నలుగురు గల్లంతయ్యారు. వారిలో ఒకరు ప్రాణాలతో బయటపడి ఒడ్డుకు చేరుకున్నారు. అతని సమాచారంతో స్థానికులు వెంటనే స్పందించి గాలింపు చేపట్టారు. కొద్దిసేపటికే నలుగురి మృతదేహాలను స్థానికులు వెలికితీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. మృతుల్లో ముగ్గురు నిజామాబాద్ పట్టణానికి చెందిన వారిగా ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విదేశీ ఉద్యోగాల పేరుతో చీటింగ్ విజయవాడ దంపతులపై హైదరాబాద్‌లో కేసు

**విదేశీ ఉద్యోగాల పేరుతో రూ.14 లక్షలు వసూలు చేసిన దంపతులు**

**బేగంపేటలో ఫ్లయింగ్ బోర్డర్ కన్సల్టెన్సీ పేరిట మోసం**

**ఇప్పటికే విజయవాడలో అరెస్ట్ అయి బెయిల్‌పై విడుదలైన జంట**

**మొత్తం 750 మంది నుంచి 12 కోట్లు వసూలు చేసినట్లు ఆరోపణలు**

**మోసం చేసిన డబ్బుతో రియల్‌ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టిన వైనం**




విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించిన విజయవాడకు చెందిన దంపతులపై హైదరాబాద్‌లో కేసు నమోదైంది. సౌజన్య, శ్రీనివాస్ అనే ఈ జంట బేగంపేటలో 'ఫ్లయింగ్ బోర్డర్ కన్సల్టెన్సీ' పేరుతో సంస్థను నడుపుతూ ఈ మోసాలకు పాల్పడినట్లు పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం, ఈ దంపతులు విదేశాల్లో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి ఒక్కొక్కరి నుంచి రూ.4 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు వసూలు చేశారు. నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు ఇప్పించకపోగా, కట్టిన డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని బాధితులు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (జజూ) పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరి మోసం వల్ల తెలంగాణ వ్యాప్తంగా సుమారు 2,000 మంది ప్రభావితమై ఉండొచ్చని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే జంటపై గతవారమే విజయవాడలో ఇలాంటి మోసం కేసులోనే అరెస్ట్ అయ్యారని, బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత కూడా మళ్లీ మోసాలు కొనసాగిస్తున్నారని బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సీసీఎస్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 318 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విజయవాడ సైబర్‌క్రైమ్ పోలీసుల దర్యాప్తులో ఈ దంపతుల మోసం భారీ స్థాయిలో ఉన్నట్లు తేలింది. యూకే, అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో నైపుణ్యం ఉన్న, లేని ఉద్యోగాల పేరుతో దాదాపు 750 మంది నిరుద్యోగుల నుంచి సుమారు రూ.11.46 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. కొంతకాలం పరారీలో ఉన్న వీరిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. వసూలు చేసిన డబ్బులో కొంత భాగాన్ని ఈ దంపతులు రియల్ ఎస్టేట్ రంగంలోకి మళ్లించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. 2024–2026 మధ్య కంకిపాడులో రూ.1.42 కోట్ల విలువైన మూడు ప్లాట్లను కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా, విదేశీ నియామకాలకు అవసరమైన విదేశాంగ శాఖ లైసెన్సు కూడా ఈ కన్సల్టెన్సీకి లేదని బాధితులు ముందునుంచే ఆరోపిస్తున్నారు. ఈ మోసం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా, డబ్బును ఇంకా ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టారు అనే కోణంలో రెండు నగరాల పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.



## విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రాజీనామా చేయాల్సిందే: తెలంగాణ బీజేపీ

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ మధ్య మాటల యుద్ధం ముదిరింది. వారం రోజుల్లోగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు రూ.12,000 కోట్ల ఫీజు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో దాదాపు 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. "మేం మా చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం, మీరు కూడా మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి" అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం జరిగిందంటూ ఇక్కడ ర్యాలీ తీసిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. మరోవైపు, బీజేపీ ఎంపీ డీకే అరుణ కూడా ఈ విషయంపై స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని అస్థిరపరిచేందుకు ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఓ వ్యక్తి యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడని ఆమె ఆరోపించారు. ఢిల్లీలో జరిగిన నిరసనల్లో విద్యార్థుల కన్నా బయటి ప్రాంతాల వారే ఎక్కువగా పాల్గొన్నారని, విదేశాల నుంచి నిధులు పంపి అల్లర్లు సృష్టించేందుకు దేశ వ్యతిరేకులు కుట్ర పన్నారని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని డీకే అరుణ స్పష్టం చేశారు. పరీక్షను రద్దు చేసి, తక్కువ సమయంలోనే మళ్లీ నిర్వహించి విద్యార్థుల ప్రయోజనాలను కాపాడిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీయే యువతను రెచ్చగొట్టి దేశ ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. పార్లమెంటులో చర్చకు సిద్ధపడని రాహుల్ గాంధీ, నల్ల బట్టలు వేసుకుని వీధుల్లో నిరసనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 పేపర్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పదో తరగతి పేపర్ లీక్ అయినప్పుడు ఎవరూ ఎందుకు రాజీనామా చేయలేదని ఆమె నిలదీశారు.

## ఆదిలాబాద్ ఎయిర్‌ఫీల్డ్‌కు రూ.2,278 కోట్ల అనుమతి

సివిల్ ఏవియేషన్ ఎన్‌క్లేవ్, ఎంఆర్ఓ కేంద్రం, కార్గో టెర్మినల్, హ్యాంగర్లు, భవిష్యత్ విస్తరణ అవసరాల కోసం కేటాయించనున్నట్లు తెలిపారు. భూసేకరణతో పాటు రహదారుల మళ్లింపు, 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ల తరలింపు, వాగుల మళ్లింపు, మిషన్ భగీరథ పైప్‌లైన్ల మార్పు, విద్యుత్ స్తంభాల తొలగింపు వంటి అనుబంధ పనులకు అవసరమైన నిధులను కూడా పరిపాలనా అనుమతిలో భాగంగా కేటాయించినట్లు వివరించారు. భారత వైమానిక దళం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా అభివృద్ధి చేయనున్న ఈ ఎయిర్‌ఫీల్డ్ రాష్ట్రానికి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ప్రాజెక్టుగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. దీని ద్వారా ఉత్తర తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, కార్గో రవాణా, పర్యాటకం, రక్షణ రంగాలకు విశేష ఊతం లభిస్తుందని, వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. కేంద్ర రక్షణ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖలు, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతర సమన్వయం కొనసాగిస్తోందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూసేకరణతో పాటు రహదారులు, విద్యుత్ లైన్లు, ఇతర మౌలిక వసతుల మార్పిడి పనులను ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి పూర్తిచేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. ప్రాంతీయ సమతుల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## మోదీ ఇమేజ్‌ను కాపాడటానికే నీలేకని కమిటీ: కాంగ్రెస్

దిల్లీ: పరీక్షల సంస్కరణల నిమిత్తం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి టాస్క్‌ఫోర్స్‌పై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దెబ్బతిన్న ప్రతిష్టను కాపాడేందుకు చేస్తున్న ఒక 'ఫిక్సింగ్' ప్రయత్నం మాత్రమేనని ఆరోపించింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ పలు అంశాలను ప్రస్తావించారు. 2024 జూన్‌లో నీట్-యూజీ సహా పలు పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు ఎదురైనప్పుడు, పారదర్శకత కోసం ప్రభుత్వం డాక్టర్ కె. రాధాకృష్ణన్ నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అయితే, మళ్ళీ 2026లో నీట్-యూజీ మరియు ఇతర పరీక్షల్లో గందరగోళం తలెత్తడంతో తాజాగా మరో "హై పవర్డ్ టాస్క్‌ఫోర్స్"ను ఏర్పాటు చేయడంపై ఆయన ఎద్దేవా చేశారు. గత కమిటీ సమర్పించిన 101 సిఫార్సులను ప్రభుత్వం నేటికీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని జైరాం రమేశ్ విమర్శించారు. 2024 నుంచి 2026 మధ్య చోటుచేసుకున్న పేపర్ లీకేజీల పరిణామాల నేపథ్యంలో, ఈ రెండేళ్ల కాలంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి (ఎన్‌టీఏ) కనీసం పూర్తిస్థాయి డైరెక్టర్ జనరల్‌ను కూడా నియమించలేదని ఆయన ఆరోపించారు. ప్రధానమంత్రి కోల్పోయిన ఇమేజ్‌ను తిరిగి నిలబెట్టుకోవడానికే ఈ ఉన్నత స్థాయి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. పేపర్ లీకేజీల ఆరోపణలపై విద్యార్థుల నిరసనలు వెల్లువెత్తిన నేపథ్యంలో, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన మరుసటి రోజే ప్రధాని మోదీ ఈ టాస్క్‌ఫోర్స్‌ను ప్రకటించడం గమనార్హం.



## చైనాలో తుపాను బీభత్సం

**నౌల్ తుపాను ధాటికి 10 మంది మృతి**

**గంటకు 162 కి.మీ. వేగంతో ఈదురుగాలులు**

**భారీ వర్షాలతో వరదల ముప్పు**

**గ్వాంగ్‌డాంగ్‌లో రైలు, విమాన సేవలు నిలిపివేత**

**జనజీవనం పూర్తిగా స్తంభించిన పరిస్థితి**

**బావి తుపాను కంటే తీవ్ర ప్రభావమని చైనా వెల్లడి**

బీజింగ్: చైనాలో నౌల్ తుపాను తీవ్ర బీభత్సం సృష్టిస్తోంది. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. వరదల ధాటికి గన్సు సీనిక్ ప్రాంతంలో కనీసం 10 మంది మృతి చెందినట్లు ప్రభుత్వ మీడియా వెల్లడించింది. తుపాను ప్రభావంతో పలు ప్రాంతాల్లో నదులు, వాగులు పొంగిపొర్లుతుండగా సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. ఇటీవల చైనాను ప్రభావితం చేసిన బావి తుపాను కంటే నౌల్ తుపాను మరింత శక్తిమంతమైందని అధికారులు తెలిపారు. తుపాను ప్రభావంతో గంటకు 162 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచినట్లు పేర్కొన్నారు. గ్వాంగ్‌డాంగ్ ప్రాంతంలో భద్రతా కారణాల దృష్ట్యా హైస్పీడ్ రైలు సేవలు, విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, రవాణా వ్యవస్థలు దెబ్బతినగా జనజీవనం స్తంభించింది. తుపాను ప్రభావం కొనసాగే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక బృందాలు సహాయ చర్యలు కొనసాగిస్తున్నాయి.

## పరీక్షల సంస్కరణలకు హైపవర్ టాస్క్‌ఫోర్స్

ఈ కమిటీ సిఫార్సులు చేస్తుందని ఆయన తెలిపారు. టాస్క్‌ఫోర్స్ నివేదిక ఆధారంగా జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు చేపడతామని ప్రధాని వెల్లడించారు. ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చట్టాన్ని తీసుకొస్తున్నామని, దీనికి సంబంధించిన బిల్లును సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెడతామని చెప్పారు. పరీక్షల నిర్వహణలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భద్రతను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లో నందన్ నీలేకనితో పాటు ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్. సోమనాథ్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ తపన్ డేకా, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి. కామకోటి, కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి అనితా కర్వాల్, పరిపాలనా నిపుణుడు అమృత్‌లాల్ మీనా సభ్యులుగా ఉంటారు. కమిటీ ప్రధానంగా ఎన్‌టీఏ పరీక్షల నిర్వహణ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడం, పరీక్షల భద్రతను సాంకేతికంగా బలోపేతం చేయడం, ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలను అరికట్టేందుకు కొత్త విధానాలు రూపొందించడం, డిజిటల్ భద్రత, అభ్యర్థుల ధ్రువీకరణ, డేటా రక్షణకు అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలను సూచించడం వంటి అంశాలపై దృష్టి సారించనుంది. భవిష్యత్తులో జాతీయ స్థాయి పరీక్షలు పారదర్శకంగా, విశ్వసనీయంగా నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణను కూడా ప్రభుత్వం రూపొందించనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు.

## యువశక్తికి రాజకీయాల్లో చోటివ్వాలి

పట్టించుకోలేదని, చివరకు యువత వీధుల నుంచి పార్లమెంట్ వరకు తమ నిరసనను తెలియజేయడంతో కేంద్రం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని పేర్కొన్నారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ కారణంగా విద్యార్థులను కోల్పోయిన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని, ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఈ పరిణామాలపై ప్రధాని దేశ యువతకు క్షమాపణ చెప్పాలని కోరారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 21 ఏళ్ల యువత ఐఏఎస్, ఐపీఎస్‌లుగా, అంతర్జాతీయ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని గుర్తుచేసిన సీఎం, అలాంటి యువతకు దేశ రాజకీయాల్లో కూడా అవకాశం కల్పించాల్సిన సమయం వచ్చిందన్నారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయసును 25 నుంచి 21 ఏళ్లకు, శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 30 నుంచి 25 ఏళ్లకు తగ్గించాలని సూచించారు. ఈ అంశంపై తెలంగాణ అసెంబ్లీ, మండలిలో తీర్మానం చేసి కేంద్రానికి పంపనున్నట్లు వెల్లడించారు. పార్లమెంట్‌లో సీట్ల పెంపు, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్‌తో పాటు ఎన్నికల్లో పోటీ చేసే వయోపరిమితి తగ్గింపుపై సమగ్ర చర్చ జరగాలని సీఎం అభిప్రాయపడ్డారు. అవసరమైతే అన్ని రాజకీయ పక్షాలు, సంబంధిత వర్గాల అభిప్రాయాలను సేకరించేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. యువతకు నిర్ణయాధికారంలో చోటు కల్పించినప్పుడే దేశ ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందని ఆయన స్పష్టం చేశారు.

## మూడేళ్లలో కొత్తపల్లి రైల్వే ప్రాజెక్టు పూర్తి

2028 జూన్ నాటికి వేములవాడ రైల్వే స్టేషన్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. 2029 నాటికి మొత్తం కొత్తపల్లి రైల్వే ప్రాజెక్టును పూర్తిచేసి రైళ్ల రాకపోకలు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం చారిత్రక ఘట్టమని పేర్కొంటూ, ఇది ఆలయానికి వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యం కల్పిస్తుందని అన్నారు. సికింద్రాబాద్-యాదగిరిగుట్ట మధ్య ఎంఎంటీఎస్ రైల్వే మార్గం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తే వెంటనే పనులు ప్రారంభిస్తామని కిషన్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో ప్రస్తుతం సుమారు రూ.48 వేల కోట్ల వ్యయంతో పలు రైల్వే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల మధ్య ఎలాంటి వివక్ష లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. దేశంలో ప్రతిపాదిత బుల్లెట్ రైలు మార్గాల్లో తెలంగాణకు అనుసంధానం లభించడం రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడుతుందని వివరించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ కొమురవెల్లి భక్తుల చిరకాల కోరిక నెరవేరిందన్నారు. రైల్వే స్టేషన్‌తో ఆలయ అభివృద్ధి, పర్యాటక రంగానికి మరింత ఊతం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీలు రఘునందన్‌రావు, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ గవర్నర్ దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రొటోకాల్ అంశంపై స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకోగా, ఎమ్మెల్యేకు తగిన ప్రాధాన్యం కల్పించలేదని బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

# భావానందపురం ఆశ్రమంలో విప్ బీర్ల అయిలయ్య పూజలు



95వ ఆషాఢ ఉత్సవాల్లో కుటుంబసమేతంగా పాల్గొన్న ఆలేరు ఎమ్మెల్యే

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి/ మార్కూక్:** సిద్ధిపేట జిల్లా గజ్వేల్ డివిజన్ మార్కూక్ మండల పరిధిలోని భావానందపురం శ్రీ పాండురంగ ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన 95వ ఆషాఢ ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని శ్రీ పాండురంగ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


**రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి:**

పూజల అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పుష్కలమైన వర్షాలు కురిసి రైతులు సమృద్ధిగా పంటలు పండించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అంతకుముందు ఆశ్రమ నిర్వాహకులు, వేద పండితులు ఆయనకు ఆలయ సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు. అనంతరం భక్తులతో కలిసి బీర్ల అయిలయ్య మహాప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతులు, ఆలయ అర్చకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.ద

# రాజాపేట సాయి మందిరంలో గురు పౌర్ణమి మహోత్సవాలు

29న రోజంతా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక వేడుకలు

అన్నదానంతో పాటు పండితులకు, గురువులకు ఘన సత్కారం



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ఈ నెల 29వ తేది బుధవారం గురు పౌర్ణమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు అభివృద్ధి సేవా కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షుడు నంగునూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. ఆలయ అర్చక స్వామి చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు కొనసాగుతాయి. ఉదయం 8 గంటలకు షిరిడీ సాయిబాబాకు పంచామృత అభిషేకాలు, 10 గంటలకు గురు పాదుకార్చనలు, విశేష నైవేద్య నివేదనలు ఉంటాయి. 11 గంటలకు గురు పాదుకాపూజ, 11:30 గంటలకు పల్లకి సేవ, మధ్యాహ్నం 12 గంటలకు మహా మంగళహారతి, వేదాశీర్వచనం నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ, పలువురు గురువులకు సత్కార కార్యక్రమాలు చేపడతారు. దాతల సహకారంతో నిర్వహించే ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

## రాజపేటలో 26 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

వాహనంతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఒకరిపై కేసు నమోదు.. దర్యాప్తు వేగవంతం

తొలివెలుగు, రాజపేట: ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఒక వ్యక్తిని పట్టుకుని, వారి వద్ద నుంచి భారీ మొత్తంలో బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రాజపేట పోలీసులు తెలిపారు.

**తనిఖీల్లో వెలుగు చూసిన అక్రమం:**

పోలీసుల వివరాల ప్రకారం.. జూలై 25వ తేదీ ఉదయం వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ కొండ యాదయ్య సిబ్బందితో కలిసి ఎంఆర్వో కార్యాలయం సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న (టీఎస్ 30 టీ 2715) నంబరు గల వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా, అందులోని 44 ప్లాస్టిక్ సంచుల్లో సుమారు 26 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు.

**గజ్వేల్ మార్కెట్‌కు తరలిస్తుండగా పట్టివేత:**

వాహనంలో ఉన్న రేణికుంట గ్రామానికి చెందిన బొద్దుల జగదీష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, యాదగిరిగుట్ట, ఆలేరు మండలాల పరిధిలోని రేషన్ కార్డుదారుల నుంచి కిలోకు రూ.15 చొప్పున బియ్యాన్ని కొనుగోలు చేసి గజ్వేల్ మార్కెట్‌లో కిలోకు రూ.20 చొప్పున విక్రయిస్తూ అక్రమ లాభం పొందుతున్నట్లు అంగీకరించారని పోలీసులు పేర్కొన్నారు. 44 సంచుల బియ్యంతో పాటు వాహనాన్ని పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

# ప్రైవేట్ నర్సింగ్ ఆఫీసర్లకు కనీస వేతనం రూ.40 వేలు ఇవ్వాలి

కార్మిక చట్టాలను పక్కాగా అమలు చేయాలి

తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్



**తొలివెలుగు, ఎల్బీనగర్:** రాష్ట్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులు, మల్టీ స్పెషాలిటీ హాస్పిటళ్లు, నర్సింగ్ హోమ్‌లలో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ ఆఫీసర్లకు నెలకు కనీస వేతనం రూ.40 వేలుగా తక్షణమే అమలు చేయాలని తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అసోసియేషన్ ప్రమాణ స్వీకారోత్సవం, తొలి కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాలు ఆమోదించారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రైవేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్లకు నెలకు కేవలం రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు మాత్రమే వేతనాలు చెల్లిస్తూ, రోజుకు 10 నుంచి 12 గంటల పాటు విధులు నిర్వహింపజేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదనపు పని గంటలకు ఓవర్‌టైమ్ భత్యం, వారాంతపు సెలవులు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధ హక్కులు అమలు చేయడం లేదని ఆరోపించారు. ఇది భారత కార్మిక చట్టాలకు విరుద్ధమని పేర్కొన్నారు.

**కార్మిక చట్టాలను తప్పనిసరిగా అమలు చేయాలి:**

కోడ్ ఆన్ వేజెస్–2019, మినిమమ్ వేజెస్ చట్టం–1948, ఈక్వల్ రెమ్యునరేషన్ చట్టం–1976 ప్రకారం ప్రతి ఉద్యోగికి కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం చెల్లించడం తప్పనిసరి అని నాయకులు గుర్తు చేశారు. అలాగే ప్రైవేట్ రంగ నర్సుల వేతనాలు ప్రభుత్వ నర్సుల వేతనాలకు సమానంగా లేదా సమీపంగా ఉండేలా సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు పంపిన విషయాన్ని ప్రస్తావించారు.

**ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి:**

ప్రైవేట్ ఆసుపత్రుల్లో కార్మిక చట్టాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సంఘం డిమాండ్ చేసింది. నర్సింగ్ ఆఫీసర్లకు ఓవర్‌టైమ్ చెల్లింపులు, పీఎఫ్, ఈఎస్ఐ, వారాంతపు సెలవులు, ఇతర ఉద్యోగ హక్కులను తప్పనిసరిగా అమలు చేయాలని కోరింది.

**గౌరవప్రదమైన జీవనం కల్పించాలి:**

ప్రజల ప్రాణాలను కాపాడే బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తున్న నర్సింగ్ ఆఫీసర్లకు గౌరవప్రదమైన జీవనం కల్పించేలా తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని సంఘం నాయకులు పేర్కొన్నారు. నర్సింగ్ వృత్తికి తగిన గుర్తింపు, గౌరవం, సంక్షేమం కల్పించే దిశగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం. రాము, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. వెంకటేష్, రాష్ట్ర కోశాధికారి జి. అనిల్ కుమార్, రాష్ట్ర న్యాయ సలహాదారు భారతి, కార్యనిర్వాహక అధ్యక్షులు జె. టికారాం, అంబేద్కర్, ఎస్.కే. గౌస్, సీహెచ్. యాదగిరి, సంయుక్త కార్యదర్శులు శ్రేయ, వై. ప్రసాద్, పి. నరేష్, ముఖ్య సలహాదారు డి. గురు వెంకట్, రాష్ట్ర కోఆర్డినేటర్ రమేష్, ప్రచార కార్యదర్శి శ్వేత, సహాయ ప్రచార కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొప్పుల వెంకట్ రెడ్డికి 'జాతీయ ఉత్తమ సర్పంచ్–2026' అవార్డు



బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో పురస్కార ప్రదానం




గ్రామాభివృద్ధే నా ప్రధాన ధ్యేయం: సర్పంచ్ వెంకట్ రెడ్డి

**తొలివెలుగు, భువనగిరి:** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కొండాపురం గ్రామ సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కొప్పుల వెంకట్ రెడ్డి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. గ్రామాభివృద్ధి, ప్రజాసేవ, సామాజిక కార్యక్రమాల్లో విశేష కృషి చేసినందుకు నేషనల్ బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రదానం చేసే "నేషనల్ ఉత్తమ సర్పంచ్–2026" అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. నేషనల్ బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణమూర్తి చేతుల మీదుగా కొప్పుల వెంకట్ రెడ్డి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా అకాడమీ ప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా భావించి, వ్యక్తిగత చొరవతో కొండాపురం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు వెంకట్ రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగానే ఈ అవార్డును అందజేస్తున్నట్లు తెలిపారు. అవార్డు స్వీకరించిన అనంతరం కొప్పుల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకంతో ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నారని, పదవి కోసం కాకుండా గ్రామాభివృద్ధి కోసం పనిచేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నానని తెలిపారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతోనే ఈ జాతీయ అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో దేవాలయ నిర్మాణం చేపడుతున్నామని, అలాగే గ్రామ ప్రజల చిరకాల కోరిక అయిన వంతెన నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. వంతెన నిర్మాణం పూర్తయితే ఆరు గ్రామాల ప్రజలకు రాకపోకల సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా మోటకొండూరు మండలానికి స్వర్గపురి రథాన్ని అందజేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ప్రజల అవసరాల సమయంలో ఎప్పుడూ ముందుండి సేవలు అందించడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. తన సామాజిక సేవలను గుర్తించి జాతీయ స్థాయి అవార్డుతో సత్కరించిన నేషనల్ బహుజన సాహిత్య అకాడమీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి సర్పంచ్ తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేషనల్ బహుజన సాహిత్య అకాడమీ సభ్యులు, వివిధ ప్రాంతాల ప్రజాప్రతినిధులు, కొప్పుల వెంకట్ రెడ్డి అభిమానులు, శ్రేయోభిలాషులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మొల్లగూడెంలో రూపుదాల్చనున్న బీటీ రోడ్డు.. పనులను ప్రారంభించిన విప్ బీర్ల ఐలయ్య



ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

**తొలివెలుగు, రాజాపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం మొల్లగూడెం – కాశగూడెం గ్రామాల నడుమ నూతనంగా మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదివారం ఘనంగా ప్రారంభించారు. గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే ధ్యేయంగా ప్రభుత్వం అభివృద్ధి పనులను చేపడుతోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

**కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి:**

ఈ సందర్భంగా కాశగూడెం నుంచి లింగారెడ్డి వాగు వరకు గతంలో మంజూరైన బీటీ రోడ్డు పనులను సదరు కాంట్రాక్టర్ సకాలంలో పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, అతడిపై తగిన చర్యలు తీసుకోవాలని మల్లగూడెం గ్రామ సర్పంచ్ జెన్నెపల్లి బాలరాజ్ రెడ్డి, ఉపసర్పంచ్ రెడ్డబోయిన కవితల నేతృత్వంలో పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగవేణి, ఆర్ఐ నర్సింలు, పంచాయతీ కార్యదర్శి, పిఎసిఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగి పెంటయ్య గౌడ్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంగ నరేష్ గౌడ్, సిపిఐ నాయకులు చెవుల లింగం, రేగు సిద్ధులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# సోమారంలో ఉచిత వైద్య శిబిరం

- బొమ్మకంటి బ్రదర్స్ సహకారంతో కేన్స్ క్లినిక్ వైద్య సేవలు

- సదుపాయాన్ని సద్వినియోగం చేసుకున్న గ్రామస్థులు

**తొలివెలుగు, రాజపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలంలోని సోమారం గ్రామంలో ఆదివారం గ్రామ సర్పంచ్ గొలుసుల అనుష యాకూబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బొమ్మకంటి బ్రదర్స్ సహకారంతో కేన్స్ కార్డియో, న్యూరో క్లినిక్ ఆధ్వర్యంలో నిపుణులైన వైద్యులు రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. ప్రముక సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కిరణ్ లక్కిరెడ్డి నేతృత్వంలో వైద్య బృందం గ్రామస్థులకు గుండె, న్యూరో సంబంధిత సమస్యలకు పరీక్షలు చేసి నాణ్యమైన సేవలు అందించారు. గుండె రక్తనాళాల క్లిష్ట సమస్యలకు కాంప్లెక్స్ కొరోనరీ సీటీఓ స్టెంటింగ్, గుండె వాల్వ్ మార్పిడి (టావీ) వంటి అత్యాధునిక చికిత్సల్లో ప్రత్యేక నైపుణ్యం కలిగిన నిపుణులు ఒకే వేదికపై సేవలు అందించడం అభినందనీయమని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీవీటీ హృదయ–రక్తనాళ సాంకేతిక నిపుణులు సాయి కిరణ్, సంపత్, భరత్, ఇర్ఫాన్, రేడియాలజీ విభాగానికి చెందిన సాయి అభిరామ్, శివకృష్ణ, అసిస్టెంట్ కార్డియాలజిస్టులు నవీన్, ఆనంద్, డాక్టర్ గిరిధర్, బొమ్మకంటి బ్రదర్స్‌కు చెందిన బొమ్మకంటి అంజయ్య, బొమ్మకంటి శ్రీనివాస్, బొమ్మకంటి జంపయ్య, బొమ్మకంటి లింగయ్య, గ్రామస్తులు తాళ్లపల్లి నాగరాజు, చిన్నం సిద్ధిరాజు, చిట్టిమెల్ల వెంకటేశ్, బండ నరేష్, చిన్నం సంపత్, తావిటి శ్రీశైలం, దొంగ యాదవరెడ్డి, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మర్కుక్ ఆశ్రమంలో రాజాపేట భక్తుల సేవలు

- ఆషాఢి 95వ ఉత్సవాల్లో ప్రసాద తయారీ, అన్నదాన సేవల్లో పాల్గొన్న భక్తులు



**తొలివెలుగు, రాజాపేట :** సిద్ధిపేట జిల్లా మర్కుక్ మండలంలోని శ్రీ భవానంద ఆశ్రమంలో జరుగుతున్న 95వ ఆషాఢి ఉత్సవాల్లో భాగంగా శ్రీ రామకృష్ణ సాయి మందిరం రాజాపేట శాఖ ఆధ్వర్యంలో భక్తులు ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ భవానంద స్వామి ఆశీస్సులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజాపేట శాఖ సభ్యులు భక్తిశ్రద్ధలతో పాల్గొని ఆశ్రమ సేవల్లో భాగస్వాములయ్యారు. ఆశ్రమంలో అదరాసుపల్లి శ్రీధర శర్మ ఆధ్వర్యంలో, శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ వైదిక నిర్వహణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజాపేట శాఖ అధ్యక్షుడు నంగునూరు రాజు నేతృత్వంలోని భక్తుల బృందం ఉత్సవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంది. ఏకాదశి సందర్భంగా పలువురు భక్తులు శనివారం రాత్రి ఆశ్రమంలోనే బస చేసి, భక్తులకు అందించే మహాప్రసాదం తయారీలో సేవలందించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని స్వయంగా వడ్డిస్తూ సేవాభావాన్ని చాటుకున్నారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు సక్రమంగా ప్రసాదం అందేలా ఏర్పాట్లలో సహకరించారు. అంతకుముందు భక్తులు మర్కుక్ ఆశ్రమ ప్రాంగణంలోని శ్రీ భవానంద స్వామి ఆలయాన్ని, ఇతర దేవాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఈఓ బల్ల దామోదర్, వరలక్ష్మి, నంగునూరు రాజు, రితిక, జగదాంబ, బిర్రు శ్రీనివాసులు, భాగ్యలక్ష్మి, గాయత్రీ, పెంట సత్యనారాయణ, రజిత, బోగ లత, పుష్పలత, ఉప్పల స్వప్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

- మాచర్ల వినయ్ కుటుంబానికి అండగా నిలిచిన 2010 టెన్త్ బ్యాచ్ క్లాస్‌మేట్స్

**తొలివెలుగు, చిన్నగూడూరు :** చిన్నగూడూరు మండల కేంద్రానికి చెందిన మాచర్ల వినయ్ అకాల మరణంతో విషాదంలో ఉన్న ఆయన కుటుంబానికి 2010 పదో తరగతి (ఎస్ఎస్సీ) బ్యాచ్ క్లాస్‌మేట్స్ ఆర్థిక చేయూత అందించారు. కలిసి చదువుకున్న స్నేహితులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.20 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా క్లాస్‌మేట్స్ వినయ్‌తో కలిసి గడిపిన పాఠశాల రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆయన స్నేహశీలి, సహాయ సహకారాలు అందించే వ్యక్తిగా అందరి మనసుల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు. అనంతరం వినయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావించి ఈ ఆర్థిక సహాయం అందించామని క్లాస్‌మేట్స్ తెలిపారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్ము రమేష్, జంపాల సోమన్న, బెడద మధు, కొల రాజశేఖర్, గాడిపెల్లి యాకన్న, చిత్తారి నరేష్, చిత్తారి వెంకటేష్‌తో పాటు 2010 టెన్త్ బ్యాచ్ క్లాస్‌మేట్స్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ మండల అధ్యక్ష పదవి మాదిగలకే కేటాయించాలి

- పార్టీ ఆవిర్భావం నుంచి సముచిత స్థానం కల్పించలేదు
- ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి డిమాండ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** బీఆర్ఎస్ చౌటుప్పల్ మండల పార్టీ అధ్యక్ష పదవిని ఈసారి మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు చౌటుప్పల్ మండలంలో ఒక్కసారి కూడా మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి మండల అధ్యక్ష పదవి దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల స్థాయిలో పార్టీ కోసం ఎంతోకాలంగా పనిచేస్తూ, అధ్యక్ష పదవిని నిర్వహించే అర్హత ఉన్న నాయకులు ఉన్నప్పటికీ వారికి అవకాశాలు కల్పించకుండా కేవలం కార్యకర్తలుగానే పరిమితం చేస్తున్నారని విమర్శించారు. చౌటుప్పల్ మండలంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్న విషయాన్ని పార్టీ నాయకత్వం గుర్తించాలని సూచించారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కూడా మాదిగలకు పార్టీ నిర్మాణంలో తగిన ప్రాధాన్యం, సముచిత న్యాయం కల్పించలేదని పేర్కొన్నారు. మాదిగలను కేవలం ఓటర్లుగానే చూడకుండా, నాయకత్వ స్థానాల్లోనూ అవకాశం కల్పించాలని ఆయన కోరారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలే పార్టీ బలోపేతానికి దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ అధిష్ఠానం పునరాలోచన చేసి చౌటుప్పల్ మండల పార్టీ అధ్యక్ష పదవిని మాదిగ సామాజిక వర్గానికి చెందిన అర్హుడైన నాయకుడికి కేటాయించాలని బోయ లింగస్వామి డిమాండ్ చేశారు.



# మల్లఖంబ్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా డాక్టర్ ఉజ్జిని మంజుల

- ఏకగ్రీవంగా ఎన్నిక.. మల్లఖంబ్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని హామీ
- చౌటుప్పల్ ట్రినిటీ పాఠశాల ప్రిన్సిపాల్‌కు ప్రాతినిధ్యం
- అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్‌గా కేవీబీ కృష్ణారావు




**తొలివెలుగు, చౌటుప్పల్:** తెలంగాణ మల్లఖంబ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా చౌటుప్పల్‌కు చెందిన ట్రినిటీ హై స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ మల్లఖంబ్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, అసోసియేషన్ ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో డాక్టర్ ఉజ్జిని మంజులను వైస్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోగా, కేవీబీ కృష్ణారావును చీఫ్ ప్యాట్రన్‌గా ఎంపిక చేశారు. అనంతరం తెలంగాణ మల్లఖంబ్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేష్ దేశ్‌ముఖ్ నూతనంగా ఎన్నికైన పదాధికారులకు ఎన్నిక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ.. తెలంగాణలో మల్లఖంబ్ క్రీడను గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విస్తరించేలా కృషి చేస్తానని తెలిపారు. యువతలో ఈ సంప్రదాయ క్రీడపై ఆసక్తి పెంపొందించడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అసోసియేషన్‌తో కలిసి పనిచేస్తానని చెప్పారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మల్లఖంబ్ అసోసియేషన్ సభ్యులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, క్రీడా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా బుడ్డ సురేష్

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న పార్టీ కౌన్సిలర్లు
- ప్రజా సమస్యలపై గళమెత్తుతా: సురేష్



తొలివెలుగు, చౌటుప్పల్ : భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎన్నిక ఆదివారం పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకుల సమక్షంలో నిర్వహించారు. మున్సిపల్ శాఖ అధ్యక్షురాలు కడారి కల్పన ఐలయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 18వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్‌ను బీజేపీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బుడ్డ సురేష్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ప్రజా సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం గట్టిగా పోరాడుతానని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక ప్రజా సమస్యలపై బీజేపీ ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో ప్రజల తరఫున బలమైన స్వరం వినిపించాలని నూతన ఫ్లోర్ లీడర్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దూడల బిక్షం గౌడ్, రమణగొని శంకర్, ఆలే శ్రీలత చిరంజీవి, పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి, పోలోజు శ్రీధర్ బాబు, ఉడుగు వెంకటేశం గౌడ్, ఉబ్బు బుచ్చయ్య, కాసుల వెంకటేశం, కడవేరు పాండు, గుండెబోయిన వేణు, పర్నె అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఖ

# ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ అధ్యక్షుడిగా గిట్ల చంద్రశేఖర్

- నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

- సన్మానించిన కౌన్సిలర్ లావణ్య యాదగిరి



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని 9వ వార్డు మార్కండేయ నగర్ కాలనీలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం సర్వసభ్య సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో దేవాలయ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 9వ వార్డు కౌన్సిలర్ జింకల లావణ్య యాదగిరి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అభినందించి సన్మానించారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో నూతన కమిటీ సమిష్టిగా కృషి చేయాలని ఆమె ఆకాంక్షించారు. సర్వసభ్య సమావేశంలో దేవాలయ అధ్యక్షుడిగా గిట్ల చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా సుంకి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కాముని సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా అనబత్తుల లింగం, చిటుకుల నరేష్, కోశాధికారిగా రేగోటి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గుర్రం వెంకటేష్, సుంకి రాజు, దేవర కాశి, గుండేటి రవిశంకర్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ, ధార్మిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరపాటి బాబు, గిట్ల గణేష్‌తో పాటు కాలనీ పెద్దలు, భక్తులు, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్‌గా నల్ల చిన్న మల్లయ్య

- కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- ఇందిరానగర్ కాలనీలో ఆలయ సర్వసభ్య సమావేశం

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని 4వ వార్డు ఇందిరానగర్ కాలనీలో గల శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం సర్వసభ్య సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సర్వసభ్య సమావేశంలో దేవాలయ చైర్మన్‌గా నల్ల చిన్న మల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఉపాధ్యక్షుడిగా గుర్రు దానయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర బిక్షపతి ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా పోతగల్ల నరహరి, పోతగల్ల రాజు, కరగల్ల రాములు, కుక్క బాలరాజ్, నల్ల శ్రీను, పెద్దల బాలయ్య, చెరుకు వెంకటేశం, కొమ్ము ఉషయ్య, ఎడ్ల లింగస్వామి, ఓరుగంటి రాకేష్, మూటపురం రవి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ నల్ల చిన్న మల్లయ్య మాట్లాడుతూ.. భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఆలయంలో ధార్మిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడంతో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. నూతన కమిటీ ఎన్నిక పట్ల బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్, మాజీ చైర్మన్లు పెద్దల నరసింహ, కుక్క మారయ్య, పెద్దల యాదయ్య, పోతగల బాలరాజ్, కరగల్ల కుమార్, చెరుకు నరసింహ, 4వ వార్డు కౌన్సిలర్ పెద్దల చక్రపాణి, కాంగ్రెస్ పార్టీ 4వ వార్డు ఇన్‌చార్జి నల్ల నాగేష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పెద్దల సుధాకర్, మాజీ అధ్యక్షుడు పోతగల లింగస్వామి, ఎర్ర శంకర్, పోతగల శ్రీనివాస్, పోతగల నరసింహతో పాటు కాలనీ వాసులు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ఆలయ భక్తులు, కాలనీ పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి రాష్ట్ర సంఘం కట్టుబడి ఉంది





**పోచంపల్లిలో జిల్లా కార్యాలయం, ఉచిత వైద్య శిబిరం ప్రారంభం**

**మృతుని కుటుంబానికి రూ.4.10 లక్షల భరోసా చెక్కు అందజేత**

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం నిరంతరం కృషి చేస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్ అన్నారు. ఫోటోగ్రాఫర్ల ఐక్యతతో అమలు చేస్తున్న 'కుటుంబ భరోసా పథకం' ఆపదలో కుటుంబాలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవం, వివేర్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఉచిత వైద్య, కంటి పరీక్షల శిబిరాన్ని ప్రారంభించి ఏర్పాట్లను పరిశీలించారు. శిబిరంలో అధిక సంఖ్యలో ఫోటోగ్రాఫర్లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం లక్ష్మణ్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన జిల్లా సంఘం కార్యాలయాన్ని రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇటీవల రామన్నపేట మండలానికి చెందిన ఫోటోగ్రాఫర్ నకరికంటి మహేష్ మృతి చెందడంతో, కుటుంబ భరోసా పథకం కింద రూ.4.10 లక్షల చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. సమావేశంలో ఎస్కే హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు సంఘం సభ్యుల ఐక్యత వల్లే మరణించిన ఫోటోగ్రాఫర్ల కుటుంబాలకు లక్షల్లో ఆర్థిక సహాయం అందించడం సాధ్యమైందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో ఫోటోగ్రాఫర్లు కూడా కాలానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకొని కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. వినూత్న ఆలోచనలతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తేనే ఈ రంగంలో నిలదొక్కుకోవచ్చని అన్నారు. కొన్ని శక్తులు సంఘ ఐక్యతను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, సభ్యులంతా సంఘటితంగా ఉండి అలాంటి ప్రయత్నాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఫోటోగ్రాఫర్ల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం రాష్ట్ర సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు భోగ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జగదీష్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్రామాల అప్పిరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి చిలువేరు ప్రవీణ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు బొమ్మగాని గణేష్, గౌరవ సలహాదారు హరీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరి రెడ్డి, కోశాధికారి తునికి దశరథ్, మండల అధ్యక్షుడు కేఎం విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శి రవ్వ నవీన్, ఉపాధ్యక్షుడు చెక్క మల్లేష్, కోశాధికారి సకినాల సిద్ధేశ్వర్, సహాయ కార్యదర్శి దొడ్డమోని వంశీధర్, గౌరవ సలహాదారు రచ్చ వినోద్, కార్యవర్గ సభ్యులు విఘ్నేష్, వంగూరి నరేష్, తవటం ఉమాకాంత్, పెద్దిరెడ్డి వెంకటేష్, బేతి నిఖిల్‌తో పాటు జిల్లా, మండలాల ఫోటో, వీడియో గ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

# మామూళ్ల మల్కాజిగిరి.. కాగితాల్లోనే సీజ్... ఆగని అక్రమ నిర్మాణాలు

**పర్మిషన్లు రెండు కేటగిరీలకు.. నిర్మాణాలు మాత్రం ఆకాశానికే**

**చెరువునూ మింగేస్తున్నా.. పట్టని ప్లానింగ్, హైడ్రా**







అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని హైకోర్టు ఇటీవల ఆందోళన వ్యక్తం చేసింది..అనధికారిక నిర్మాణాలు చేపట్టిన వారు మూల్యం చెల్లించాల్సిందేనని, ఇందుకోసం భారీ జరిమానా విధించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది... అత్యున్నత న్యాయస్థానం స్పందించినా.. టౌన్ ప్లానింగ్ అధికారుల్లో చలనం కరువైంది. నిబంధనలను కాగితాలకే పరిమితమవుతూ..అక్రమ నిర్మాణాల నుంచి అందినంత దండుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. ఫలితంగా అనుమతులు తక్కువ..అంతస్తులు ఎక్కువ..కాసులు ఇచ్చుకుంటే చాలు..ఏమైనా చేసుకోవచ్చు అనే చందంగా మారింది మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలోని టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరు. అక్రమ నిర్మాణాలపై బాధ్యతాయుత పౌరులు అధికారుల దృష్టికి తీసుకెళ్తే..'మా దగ్గర సిబ్బంది లేరు..ఏం చేయాలి?' అంటూ సమాధానాలు ఇస్తుండడం గమనార్హం. భారీగా ముడుపులు దండుకొని క్షేత్రస్థాయి నిఘాను గాలికి వదిలేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**మాస్టర్ ప్లాన్ రోడ్డులో కమర్షియల్ నిర్మాణాలు**

మీర్జాలగూడ నుంచి నేరేడ్‌మెట్ వరకు మాస్టర్‌ప్లాన్ రోడ్డు ఉంది. అయితే ఈ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగానే నిర్మాణాలు చేపడుతున్నారు. ఆయా రోడ్డు ప్రాంతాల్లో కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్న మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టడంలేదు. మీర్జాలగూడ, నేరేడ్‌మెట్ మూడుగుళ్ల ప్రాంతాల్లో అనుమతులు లేకుండా కమర్షియల్ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కానీ అధికారులు వాటిపై చర్యలు చేపట్టలేదు. అనుమతులు లేని నిర్మాణాలకు ట్రేడ్ లైసెన్సను మంజూరు చేయకుండా ఉండాల్సిన అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నది. ఓల్డ్ సఫిల్‌గూడలో బహుళ అంతస్తులు నిర్మించి, ఓసీ విడుదల చేయగానే ఆయా నిర్మాణాలలో నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ షెట్టర్లు వేస్తున్నారు.

**చర్యలు తీసుకోని టౌన్ ప్లానింగ్**

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని జ్యోతినగర్, పీవీఎన్‌కాలనీలో అనుమతులకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. జ్యోతినగర్‌లో అనుమతులకు విరుద్ధంగా 5 అంతస్తులు నిర్మాణాలు చేస్తున్నారు. అక్రమ నిర్మాణం అని తెలిసి, అధికారులు సీజ్ కూడా చేశారు. అయితే సీజ్ చేసిన నిర్మాణ పనులు ఆపడం లేదు. నిర్మాణ పనులు జరుగుతున్న విషయం తెలిసిన టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు దారితీస్తున్నది. పీవీఎన్‌కాలనీలో రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని, గల్లీ రోడ్డులో 5 అంతస్తులు నిర్మాణం చేస్తున్నారు. గతంలో ఫిర్యాదులు వస్తే సామగ్రి జప్తు చేశారు.. సీజ్ చేశారు.. అయినా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. దీనిపై అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తగిన చర్యలు చేపడితే అసలు విషయం వెలుగుచూసే అవకాశం ఉంది.

**హైడ్రా మౌనమేలా?**

లోతుకుంట భూ వివాదం సంబంధించి విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విచారణ సందర్భంలో ఎంపిక చేసుకున్న వాటిల్లో మాత్రమే కూల్చివేతలు జరుపుతున్నారని, 40 చెరువుల జోలికి ఎందుకు వెళ్లడం లేదని న్యాయస్థానం ప్రశ్నించింది. ఈ నేపథ్యంలోనే మౌలాలి సర్కిల్ పరిధిలోని బండ చెరువు ఎఫ్టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్న హైడ్రా అటు వైపు వెళ్లకపోవడం తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవంగా బండ చెరువును అభివృద్ధి చేయాలని, కోర్టు కేసులు పరిష్కరించాలని కొంతకాలంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పోరాటం చేస్తున్నారు. ఈ క్రమంలో కొంతమంది బండ చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో అనుమతులు లేకుండా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. ఎంఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యల్లో మీనమేషాలు లెక్కిస్తున్నారు..ఇక ప్రతి సర్కిల్ పరిధిలో హైడ్రా అధికారులు ఉన్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. నిర్మాణాలు జరుగుతున్న వాటిపై ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. అనుమతులు లేని నిర్మాణాలు చేపట్టి, అమాయక ప్రజలకు విక్రయించి, బిల్డర్లు సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో నిర్మాణాలు కూల్చివేస్తే కొనుగోలు చేసిన వారు నష్టపోతున్నారు. అదిలోనే నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

# ఫారంల తీసుకోకుంటే ఓటు గల్లంతే..!

సమగ్ర ఓటరు సవరణ జాబితాను బీఎల్‌వోలు తమకు నచ్చినట్లుగా నిర్వహిస్తున్నారు. ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, నమోదు చేసిన వివరాలను డిజిటలైజేషన్ చేయడంలో బీఎల్‌వోలు పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఇప్పటికే గడువును పొడిగించారు. పొడిగించిన గడువు కూడా పూర్తి కావస్తున్నది. కానీ కొంత మంది బీఎల్‌వోలు మాత్రం అదే తీరుగా వ్యవహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గ్రేటర్ వ్యాప్తంగా ఇప్పటిదాకా ఆన్‌లైన్ ప్రక్రియ 60 శాతానికి మించలేదు. గ్రామీణ జిల్లాల్లో ఇప్పటికే 90 శాతానికి పైగా పూర్తిచేశారు. చాలా ప్రాంతాల్లో వివరాలు నింపని ఎన్యుమరేషన్ ఫారాలు ఇంకా బీఎల్‌వోల దగ్గరే ఉన్నాయి. ఈనేపథ్యంలో గడువు సమీపస్తుండటంతో బీఎల్‌వోలు ఎన్యుమరేషన్ ఫారాలు తీసుకోని ఓటర్లను షిఫ్టెడ్ జాబితాలో చేరే పనిలో పడ్డారు. అలా చేయడం వల్ల నగరంలో ఉన్న ఓటర్లందరికీ ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు లెక్కల్లో చూపేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఫారాలు తీసుకోని ఓటర్ల వివరాలను ఆయా పార్టీలకు చెందిన బీఎల్‌ఏలకు తెలియజేస్తున్నారు. వాళ్లకూ తెలియని వాళ్ల పేర్లను షిఫ్టెడ్ జాబితాలో చేరుస్తున్నారు. ప్రతి పోలింగ్ సెంటర్‌లోనూ బీఎల్‌ఏల సహకారంతో ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకోని ఓటర్లందరినీ షిఫ్టెడ్ జాబితాలో నమోదు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

**అసలైన ఓట్లు తొలగిపోయే ప్రమాదం**

గ్రేటర్ పరిధిలో బీఎల్‌వోలు వ్యవహరిస్తున్న తీరుతో నగరంలోని అసలైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలు ఇవ్వకపోవడంతో తమ ఓటు పోతుందేమోననే ఆందోళనలో నగర ప్రజలు ఉన్నారు. దానికి తోడు ఇప్పుడు ఫారాలు తీసుకోనివాళ్లను షిఫ్టెడ్ జాబితాలో చేరుస్తుండటంతో అసలైన ఓట్లు గల్లంతయ్యే ప్రమాదముంది. ఓటర్లు తమకు సంబంధించిన ఫారాలను తీసుకోకుంటే బీఎల్‌వోలు స్వయంగా వారి ఇంటికి వెళ్లి ఆరా తీయాల్సి ఉంటుంది. ఓటర్లు నిజంగానే ఆ చిరునామాలో లేకపోయినా, లేదంటే ఇతర ప్రాంతాలకు షిఫ్ట్ అయిన సందర్భంలో మాత్రమే వారిని షిఫ్టెడ్ జాబితాలో చేర్చాలి. పోలింగ్ కేంద్రాల్లోనే బీఎల్‌వోలను అడిగి, లేదంటే వాళ్లే సొంత నిర్ణయం తీసుకుని షిఫ్ట్ జాబితాలో చేర్చడం సరికాదని ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా బీఎల్‌వోలు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయడంలోనూ నిర్లక్ష్యం చేస్తున్నారని పలు ప్రాంతాల్లో ఓటర్లు ఆరోపిస్తున్నారు. నిజమైన ఓటర్లను గుర్తించి వారితో ఎన్యుమరేషన్ ఫారాలను అందించి వివరాలు నమోదు చేసేలా ప్రోత్సహించాలి.

# మాట తప్పిన ఎమ్మెల్యే

**ఉచిత ఇందిరమ్మ ఇండ్లు ఉత్తమాటేనా?**

**కంటోన్మెంట్‌లోని 539 గుడిసెవాసులకు ఇండ్లిస్తామని ఎమ్మెల్యే హామీ**

**రక్షణ శాఖకు భూబదలాయింపు చేసి గృహాలు నిర్మించేందుకు సర్వే**

**రూ. 6 లక్షలు చెల్లించాలనడంతో లబ్ధిదారుల ఆందోళన**

కాంగ్రెస్ ప్రభుత్వం క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇండ్లంటూ తీసుకొచ్చిన ప్రీలాంచ్ పథకం పేద ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. ఏండ్ల తరబడి కూలీ పనులు చేసుకుని బతుకీడుస్తున్న నిరుపేదల సొంతింటి కలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రియల్ ఎస్టేట్ చేస్తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు నాణ్యమైన డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అన్ని వసతులు కల్పించి అందజేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నిరుపేదలు రూ.6 లక్షలు చెల్లిస్తేనే ఇందిరమ్మ ఇండ్లను ఇస్తామని ప్రకటిస్తున్నది. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇందిరమ్మ ఇండ్లను ఉచితంగా నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నగరంలోని బస్తీల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని మడ్‌ఫోర్ట్ అంబేద్కర్ హట్స్‌లో ఏండ్ల తరబడిగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని గతేడాది జూన్‌లో హామీ ఇచ్చారు. వాళ్లు నివసించే స్థలం రక్షణ శాఖకు చెందినది కావడంతో భూబదలాయింపు చేసి అక్కడే ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామన్నారు. ఈమేరకు సర్వే నిర్వహించి 539 అర్హులైన కుటుంబాలు ఉన్నట్లు గుర్తించారు. వారందరికీ ఉచితంగా ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని మాటిచ్చారు. కానీ తాజాగా ప్రభుత్వం గ్రేటర్ వ్యాప్తంగా లక్ష ఇండ్లను రూ.6 లక్షల చొప్పున విక్రయిస్తామని ప్రకటించడంతో 539 కుటుంబాల సొంతింటి కలపై నీళ్లు చల్లినట్లయింది.

**కూలీలు రూ.6 లక్షలు ఇవ్వగలరా?**

కంటోన్మెంట్‌లోని మడ్‌ఫోర్డ్ అంబేద్కర్ హట్స్‌లో నివసించే గుడిసెల వాసులంతా అడ్డా కూలీలు, దినసరి కార్మికులు, చెత్త సేకరణ పనులు, ఆటో కార్మికులు, భవన నిర్మాణ పనులతో పాటు ఇతర చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా సుమారు ఐదు దశాబ్దాలుగా ఇక్కడ నివసిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే సాయన్న సహకారంతో గుడిసెవాసులకు విద్యుత్ సదుపాయం, తాగునీటి వసతి కల్పించారు. మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో బయో టాయిలెట్స్ నిర్మించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా గెలుపొందిన శ్రీగణేశ్ గతేడాది గుడిసెల వద్దకు వెళ్లి అందరికీ పక్కాగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వం రూ.6 లక్షలు చెల్లించిన వారికి లాటరీ విధానంలో ఇండ్లను విక్రయిస్తామని ప్రకటించడంతో వారి ఆశలు అడియాశలయ్యాయి. ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఇచ్చిన మాట ప్రకారం తమకు ఉచితంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు. తమకు వచ్చే ఆదాయంతో పూట గడవడమే కష్టంగా ఉంటే రూ. 6 లక్షలు ఎక్కడి నుంచి తేల్చి చెల్లించాలని ప్రశ్నిస్తున్నారు. నిరుపేదలను నుంచి లక్షల రూపాయల వసూలు చేయడమే ప్రజా పాలనా? అని నిలదీస్తున్నారు. ప్రభుత్వ ప్రకటనపై ఎమ్మెల్యే శ్రీగణేశ్ స్పందించి 539 కుటుంబాలకు సమాధానం చెప్పాలని కోరుతున్నారు.


**ఎమ్మెల్యే ఇచ్చి మాట నిలుపుకోవాలి**

మా తల్లిదండ్రులు 40 ఏండ్ల కిందటి నుంచి ఇక్కడే నివసిస్తున్నారు. మా అమ్మనాన్నతో పాటు నేను కూడా దినసరి కూలీగా పనిచేస్తున్నా. గతేడాది కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ మా గుడిసెల వద్దకు వచ్చి అందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. ఇది రక్షణ శాఖ భూమి కావడంతో వాళ్లకు భూబదలాయింపు ద్వారా వేరే చోట ఇచ్చి ఇక్కడ మాకు పక్కా ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. సంబంధిత పత్రాలతో ఎమ్మార్వో ఆఫీస్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పి వెళ్లారు. ఇప్పుడు ప్రభుత్వం రూ. 6 లక్షలు చెల్లించిన వారికే ఇండ్లు ఇస్తామని ప్రకటించింది. కూలీ పనిచేసే మా దగ్గర రూ.6 లక్షలు ఎలా ఉంటాయి? ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే ఉచిత ఇండ్లు నిర్మించి ఇవ్వాలి.

-- వెంకటరాములు, మడ్‌ఫోర్ట్ అంబేద్కర్ హట్స్

**రూ.6 లక్షలు ఎక్కడి నుంచి తేవాలి?**

ఈ ప్రాంతంలో గత 40 ఏండ్లుగా గుడిసెల్లో నివసిస్తూ దినసరి కూలీగా జీవనం సాగిస్తున్నాం. ఇందిరమ్మ ఇండ్లను ఉచితంగా ఇక్కడే కట్టించి ఇస్తామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ గతేడాది హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు రూ. 6 లక్షలు ఇచ్చినోళ్లకే ఇల్లు వస్తది అంటున్నారు. కూలీ పని చేసుకునే మా దగ్గర ఆరు లక్షలు ఎలా ఉంటాయి? ఇల్లు కోసం దరఖాస్తు చేసుకునేందుకే ముందుగా రూ.10 వేలు కట్టాలంటున్నారు. ఏండ్ల తరబడిగా కూలీపని చేసుకుని పిల్లలను పోషించుకుంటూ.. బతుకుతున్న మాకు ఉచితంగా ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలి. రూ. 6 లక్షలు మా దగ్గర ఉంటే గుడిసెల్లో ఎందుకు బతికేటోళ్లం? అవే ఆరు లక్షలతో మేమే ఇండ్లు కట్టుకునేటోళ్లం కదా? ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం మాకు ఇండ్లు కట్టించి మాట నిలుపుకోవాలని కోరుతున్నాం.



## బిజినెస్

# సీఎఫ్‌జీ ఇండియా ఎండీగా రాజేశ్

అమెరికాలో అతిపెద్ద ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూట్ సంస్థల్లో ఒకటైన సిటిజెన్స ఫైనాన్షియల్ గ్రూపు అనుబంధ సంస్థయైన సిటిజెన్ ఫైనాన్షియల్ గ్రూపు(సీఎఫ్‌జీ) ఇండియా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్(జీసీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా రాజేశ్ మణి నియమితులయ్యారు. ఆర్థికసేవలు, టెక్నాలజీ విభాగాల్లో రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్న రాజేశ్..గ్లోబల్ టెక్నాలజీ ఆర్గనైజేషన్‌లో ఉన్నతాధికారిగా సేవలు అందించారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ..సీఎఫ్‌జీ ఇండియాలో చేరడం చాలా సంతోషంగా ఉన్నదని, బ్యాంకింగ్ లో వచ్చే మార్పులకు అనుగుణంగా టెక్నాలజీ సేవలను అందించాల్సివుంటుందన్నారు. +వశీస్త్రతీఝజూష్ట్ర



# ఫెడ్ ద్రవ్య సమీక్షపై ఆధారం

**క్యూ1 ఫలితాలు, మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలూ ప్రధానమే**

**మార్కెట్ పల్స్**

దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఆటుపోట్లకు లోనవుతున్నాయి. అమెరికా-ఇరాన్ దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తకర వాతావరణం, ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికానికి (ఏప్రిల్-జూన్ లేదా క్యూ1)గాను ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు ప్రకటిస్తున్న ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం.. మదుపర్లను అమ్మకాల ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారంతో పోల్చితే గత వారం సెన్సెక్స్ 2,091.68 పాయింట్లు క్షీణించి 76,059.77 వద్ద నిలిచింది. నిఫ్టీ 566.85 పాయింట్లు పతనమై 23,767.45 దగ్గర స్థిరపడింది. ఇక ఈ వారం ముడి చమురు ధరలు, క్యూ1 ఆర్థిక ఫలితాలకుతోడు.. మంగళ, బుధవారాల్లో జరిగే అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య సమీక్షలో తీసుకొనే నిర్ణయాలు కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల కదలికలకు కీలకం కానున్నాయి. అలాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులు, ఎల్ నినో సంబంధిత సమాచారం సైతం ప్రధానమే. కాగా, బ్యాంకింగ్, ఆటో, ఆయిల్ షేర్లలో సెల్లింగ్ ప్రెషర్‌కు అవకాశాలున్నాయి. ఇక అమ్మకాల ఒత్తిడి




కనిపిస్తే నిఫ్టీకి 23,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,000-24,200 పాయింట్ల స్థాయికి వెళ్లవచ్చనీ చెప్తున్నారు.

**గమనిక..**

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న వివరాలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు.

# కంపెనీ ఒప్పుకొంటే పీఎఫ్ చందాని తగ్గించుకుంటారా!

ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ప్రకాశ్‌కు నెలకు లక్ష రూపాయల జీతం. దీంట్లో బేసిక్ పే, డీఏ కలిపి రూ.50 వేలుగా ఉన్నది. కంపెనీ యాజమాన్యం పాత విధివిధానాల ప్రకారం ఇందులో 12 శాతాన్ని (రూ.6,000) పీఎఫ్‌గా కోత పెడుతూ వస్తున్నది. అయితే ఇప్పుడు కొత్త మార్గదర్శకాలు వచ్చాయి. చట్టబద్ధ వేతన పరిమితిగా ఎప్పట్నుంచో ఉన్న రూ.15,000 (బేసిక్ పే-డీఏ కలిపి) ప్రకారం 12 శాతాన్ని (రూ.1,800) చెల్లిస్తే చాలు. ఉద్యోగి ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా ఇది తప్పనిసరిగా చెల్లించాల్సిందే. కానీ ఇప్పుడు ఆపై మొత్తాన్ని (రూ.6,000లలో రూ.1,800 పోగా మిగిలేది) చెల్లించాలా? వద్దా? అన్నది మాత్రం పూర్తిగా ఉద్యోగి ఇష్టంపైనే ఆధారపడి ఉంటుంది. దీంతో తమ కంపెనీ హెచ్ఆర్ విభాగానికి తెలిపి, వారి అనుమతితో అధిక పీఎఫ్ చెల్లింపునకు స్వస్తి (ఈపీఎఫ్ రూల్స్, డాక్యుమెంటేషన్‌కు లోబడి ఉంటుందని మరువద్దు) పలుకాలని ప్రకాశ్ భావిస్తున్నాడు. దీనివల్ల అతని నెలవారీ జీతం రూ.4,200 పెరుగుతుంది. మరి ఇది ఎంతవరకు లాభం? ఆర్థిక నిపుణులు ఏమంటున్నారో చూద్దాం.

**ఐదేండ్లు దాటితే నో టీడీఎస్!**

ఎలాంటి అంతరాయం లేకుండా ఐదేండ్ల సర్వీస్‌ను పూర్తి చేసుకున్న ఉద్యోగులకు



ఈపీఎఫ్ ఉపసంహారణలపై పన్ను (టీడీఎస్) వర్తించదు. ఒకవేళ ఉద్యోగంలో చేరిన ఐదేండ్లలోపే విత్‌డ్రాయల్స్‌కు దిగితే సదరు మొత్తాలు మీ వ్యక్తిగత ఆదాయ పన్ను స్లాబు పరిధిలోకి వస్తాయి. అయితే ఉపసంహారణలు రూ.50,000 మించితే (పాన్ లింకైతే)నే 10 శాతం టీడీఎస్ ఉంటుంది. అయినప్పటికీ ఫామ్ 15జీ సమర్పిస్తే చెల్లించనక్కర్లేదు. సీనియర్ సిటిజన్లు ఇందుకోసం ఫామ్ 15హెచ్‌ను సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ఇక పాన్ లింక్ కానివారికి గరిష్ఠంగా 34.6 శాతం టీడీఎస్ కోత ఉంటుంది.

## స్పోర్ట్స్






# మీరా గోల్డ్ తీన్‌మార్

**కామన్వెల్త్‌లో చాను హ్యాట్రిక్ స్వర్ణం**

**రిషికంఠకు రజతం**

గ్లాస్గో: కామన్వెల్త్ క్రీడల నాలుగో రోజు భారత వెయిట్‌లిఫ్టర్లు పతకాల మోత మోగించారు. ఈ క్రీడల్లో హ్యాట్రిక్ స్వర్ణంపై గురిపెట్టిన స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను మరోసారి పసిడితో టోర్నీలో తన ఆధిపత్యాన్ని ఘనంగా చాటిచెప్పగా మణిపూర్‌కే చెందిన యువ క్రీడాకారుడు రిషికంఠ సింగ్ రజతంతో మెరిశాడు. సీడబ్ల్యూజీలో పాత రికార్డుల దుమ్ము దులుపుతూ పతకాల బరువులెత్తిన ఈ ఇద్దరు మణిపూర్ క్రీడాకారులు దేశానికి ఒకేరోజు రెండు మెడల్స్ అందించడంతో పతకాల పట్టికలో భారత్.. మొత్తంగా 3 పతకాలతో 7వ స్థానం లో నిలిచింది. మిగిలిన క్రీడల విషయానికొస్తే లాన్‌బౌల్స్, జిమ్నాస్టిక్స్‌లో భారత్‌కు నిరాశ ఎదురవగా వ్యక్తిగతంగా విఫలమైన స్విమ్మ ర్లు.. మరోసారి పతక రేసులోకి వచ్చారు.

**రిషికంఠకు రజతం**

పురుషుల 60 కి. విభాగంలో యువ వెయిట్‌లిఫ్టర్ రిషికంఠ రజతంతో మెరిశాడు. ఈ మణిపూర్ లిఫ్టర్ మొత్తం 264 కిలోల బరువులెత్తి రెండో స్థానంతో తన కామన్వెల్త్ కెరీర్‌లో పతక బోణీ చేశాడు. స్నాచ్‌లో రికార్డు స్థాయిలో 121 కి. ఎత్తిన అతడు.. క్లీన్ అండ్ జెర్క్‌లో 143 కి. ఎత్తాడు. స్నాచ్‌లో రాణించినప్పటికీ క్లీన్ అండ్ జెర్క్‌లో 151 కి. ఎత్తే క్రమంలో అతడు చివరి రెండు ప్రయత్నాల్లో విఫలమై సిల్వర్‌తో సరిపెట్టుకున్నాడు. మలేషియాకు చెందిన మహ్మద్ అనిక్ కాడ్సాన్ 273 కిలోలు (121o152) స్వర్ణం నెగ్గగా కెన్యా క్రీడాకారుడు జోషువా అముంగ 244 కి. (109o135)తో కాంస్యం సాధించాడు. గత ఎడిషన్‌లో 55 కి. విభాగంలో బరిలోకిదిగి పతకం కొట్టకుండానే వెనుదిరిగన రిషికంఠ.. ఈసారి తన కలను నెరవేర్చుకున్నాడు.

# విజయం పరిపూర్ణం

**జింబాబ్వే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత్**

**వైభవ్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్**




వరుసగా రెండు సిరీస్ ఓటముల తర్వాత జింబాబ్వే పర్యటనకు వెళ్లిన భారత్.. ఆతిథ్య జట్టుతో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం హరారే వేదికగా జరిగిన ఆఖరి పోరులో టీమిండియా.. 35 పరుగుల తేడాతో ప్రత్యర్థిని ఓడించింది. వైభవ్ సూర్యవంశీ (49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లతో 81) ఈ సిరీస్‌లో రెండో అర్ధ శతకంతో మెరిసిన వేళ ఫస్ట్ బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లకు 5 వికెట్ల నష్టానికి 192 రన్స్ చేసింది. ఇషాన్ కిషన్ (29), సారథి శ్రేయస్ అయ్యర్ (27), రింకూ సింగ్ (25) రాణించారు. ఛేదనలో జింబాబ్వే.. పూర్తి ఓవర్లు ఆడినా 157/7 వద్దే ఆగిపోయింది. ర్యాన్ బర్ల్ (43 బంతుల్లో 5 ఫోర్లతో 54), వెస్లీ మెధెవెరె (28) ఆ జట్టు గెలుపు కోసం ఆఖరిదాకా పోరాడారు. వైభవ్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు లభించాయి.

**దంచి.. ఆగి.. మళ్లీ దంచి..**

వరుసగా మూడో మ్యాచ్‌లోనూ అభిషేక్ (2) నిరాశపరిచినా వండర్ కిడ్ వైభవ్ మాత్రం మరోసారి బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. పవర్ ప్లేలో తనదైన శైలిలో విజృంభించిన అతడు.. తర్వాత నెమ్మదించి, అర్ధ శతకం తర్వాత మరోసారి రెచ్చిపోయి పర్యాటక జట్టు భారీ స్కోరు సాధించేందుకు బాటలు వేశాడు. తొలి ఓవర్లోనే రెండు బౌండరీలతో బాదుడుకు శ్రీకారం చుట్టిన ఈ బీహార్ చిన్నోడు.. ఇషాన్‌తో జతకలిశాక ధాటిగా ఆడాడు. ముజరబాని నాలుగో ఓవర్లో అతడు 6, 4 దంచగా ఎవాన్స్ బౌలింగ్‌లో ఇషాన్ రెండు ఫోర్లు కొట్టాడు. పవర్ ప్లేను 64/1తో ముగించిన ఈ ద్వయం.. ఆ తర్వాత దూకుడు తగ్గించింది. వైభవ్, ఇషాన్ క్రీజులో ఉన్నా 8-12 ఓవర్ల మధ్య 23 పరుగులు మాత్రమే వచ్చాయి. 31 బంతుల్లో వైభవ్ ఫిఫ్టీ పూర్తయింది. కానీ సికందర్ 11వ ఓవర్లో ఇషాన్‌ను బౌల్డ్ చేసి 75 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. ఇషాన్ నిష్క్రమించినా కెప్టెన్ రాకతో సూర్యవంశీ మళ్లీ గేర్ మార్చాడు. మధెవెరె ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ ఫోర్లు కొట్టిన అతడు.. రజా 13వ ఓవర్లో ముందుకొచ్చి 102 మీటర్ల సిక్స్ దంచాడు. మధెవెరెనే వేసిన 15వ ఓవర్లో సిక్స్ కొట్టిన అతడు.. ఆఖరి బంతికి ఎవాన్స్ క్యాచ్ పట్టడంతో 50 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆఖర్లో శ్రేయస్ (27) నిష్క్రమించినా రింకూ సింగ్ (25) మెరుపులతో ఇన్నింగ్స్‌కు ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.

**బర్ల్, వెస్లీ పోరాడినా..**

భారీ ఛేదనలో 4 ఓవర్లకు 34/3తో కష్టాల్లో నిలిచిన జింబాబ్వేను బర్ల్, మధెవెరె ఆదుకున్నారు. మయాంక్.. ఫస్ట్ బాల్‌కే బెన్నెట్‌ను డకౌట్ చేయగా మెయర్స్ (19), కరన్ (20) రెండో వికెట్‌కు 34 రన్స్ జోడించారు. కానీ యశ్ ఠాకూర్ ఒకే ఓవర్లో మెయర్స్, రజాను ఔట్ చేశాడు. కరన్‌కు బిష్ణోయ్ చెక్ పెట్టగా బర్ల్, వెస్లీ వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేశారు. ఈ జోడీ ఐదో వికెట్‌కు 60 పరుగులు జోడించినా ఆ జట్టు ఓటమిని ఆపలేకపోయింది. భారత బౌలర్లలో మయాంక్ (3/29), యశ్ (2/45) రాణించారు.

అంతర్జాతీయ క్రికెట్‌లో అతి పిన్న వయసులోనే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు గెలుచుకున్న ఆటగాడిగా వైభవ్ రికార్డులకెక్కాడు. సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లకు 192/5 (వైభవ్ 81, ఇషాన్ 29, ఎవాన్స్ 2/41, వెస్లీ 1/37); జింబాబ్వే: 20 ఓవర్లకు 157/7 (బర్ల్ 54లి, వెస్లీ 28, మయాంక్ 3/29, యశ్ 2/45)

# బుమ్రా, వాషింగ్టన్ అనుమానమే?

వచ్చే నెలలో శ్రీలంక పర్యటనకు వెళ్లనున్న భారత జట్టును మంగళవారం (28న) ప్రకటించనుండగా సెలక్టర్లకు ప్రధాన ఆటగాళ్ల ఫిట్‌నెస్ చిక్కులు కొత్త తలనొప్పులు తీసుకొచ్చాయి. ఇంగ్లండ్ పర్యటనలో గాయాలపాలైన స్పీడ్‌స్టర్ జస్‌ప్రీత్ బుమ్రా, స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఈ సిరీస్‌కు అనుమానమే అని బీసీసీఐ సీవోఈ వర్గాలు తెలిపాయి. ఈ ఇద్దరూ పూర్తిస్థాయిలో కోలుకోకపోవడంతో తొలి టెస్టుకు వీరిని ఎంపికచేయడం కష్టమేనని తెలుస్తున్నది. ఫస్ట్ టెస్ట్ మిస్ అయితే మిగిలే ఏకైక టెస్టుకైనా వీరిని సెలక్ట్ చేయాలా? వద్దా? అన్నదానిపై సెలక్టర్లు మల్లగుల్లాలు పడుతున్నారు. వీరితో పాటు మరో ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి, పేసర్ హర్షిత్ రాణా సైతం లంకతో సిరీస్‌కు అందుబాటులో ఉండరని సీవోఈ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో జట్టులో నాలుగో స్పిన్నర్‌గా మానవ్ సుతార్, హర్ష్ దూబే,



సారాంశ్ జైన్‌లలో ఎవరో ఒకరికి చోటు దక్కే అవకాశం కనిపిస్తున్నది. ఆల్‌రౌండర్లకు ప్రాధాన్యమిచ్చే గంభీర్.. సుతార్, సారాంశ్‌లలో ఎవరికి ఓటు వేయనున్నాడన్నది త్వరలో తేలనుంది. ఇక బుమ్రా ఈ సిరీస్‌కు గైర్హాజరీ అయితే సిరాజ్‌కు అండగా గుర్నూర్ బ్రార్, ప్రసిద్ధ్ కృష్ణ పేస్ భారాన్ని మోయనున్నారు.